



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# కప్పట్రాళ్లకు అండగా ఉంటాం

- అవసరమైతే జిల్లా బంద్
- గ్రామంలో పర్యటించిన వామపక్ష నాయకులు
- సిఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తాం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/దేవనకొండ**

యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్న కప్పట్రాళ్ల ప్రజలకు అండగా ఉంటామని వామపక్ష పార్టీల నాయకులు భరోసా ఇచ్చారు. అవసరమైతే జిల్లా జిల్లా బంద్ చేపడతామని హెచ్చరించారు. వామపక్షాల నాయకులు బుధవారం కప్పట్రాళ్లను సందర్శించారు. 2017లో మట్టి నమూనాల సేకరణ కోసం కప్పట్రాళ్ల ఫారెస్టులో వేసిన బోర్లను వామపక్ష పార్టీల నాయకులు పరిశీలించారు. అంతకు ముందు గ్రామంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వీరశేఖర్, సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ యురేనియం సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజలకు నష్టం కలిగించే యురేనియం తవ్వకాలు చేపట్టబోమని ప్రభుత్వాలు ప్రజలకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యురేనియం సమస్య దేవనకొండ సమస్య మాత్రమేకాదని జిల్లా సమస్య అని తెలిపారు. అటవీ భూమిలో గంప మన్ను వేయడానికి లేదని, చెన్నకేశవ స్వామి దేవస్థానికి విద్యుత్ కోసం స్తంభాలు ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వలేదని, అలాంటిది యురేనియం తవ్వకాలకు ఎలా అనుమతి ఇస్తారన్నారు. ప్రజలకు హామీ ఇవ్వకుండా బెదిరించాలని చూడటం మంచిది కాదన్నారు. ఎవరినైనా బెదిరిస్తామంటే జిల్లా వ్యాప్తంగా తిరగబడతారన్నారు. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం కాదని, తవ్వకాలను ఆపేయాలని డిమాండ్ చేశారు.

## జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధం

**- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్**



కప్పట్రాళ్ల ప్రజలను యురేనియం నుంచి కాపాడుకునేందుకు సుదీర్ఘ పోరాటం చేస్తామని, జైలుకు వెళ్లడానికి కూడా వామపక్షాలు సిద్ధంగా ఉన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తెలిపారు. యురేనియం తవ్వకాలు ఆపేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు మేల్కొనక ముందే గత నెల 19న కప్పట్రాళ్ల ఫారెస్టులో సిపిఎం బృందం పర్యటించిందన్నారు. స్థానిక అధికారుల ప్రమేయం లేకుండానే 2018లో నిర్ణయాలు చేశారన్నారు. చెన్నకేశవ స్వామి ఆలయానికి విద్యుత్ కోసం స్తంభాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వని అటవీ శాఖ అధికారులు యురేనియం తవ్వకాలకు ఎలా అనుమతి ఇచ్చారని డిమాండ్ చేశారు. అందరూ కలిసి దేవనకొండ మండల ప్రజలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించేలా, రాబోయే తరాలను నిలబెట్టడం కోసం సుదీర్ఘ పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, ఆ పోరాటంలో వామపక్షాలు ముందుంటాయని తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్

## వెనక్కి తగ్గేది లేదు

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ**



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ యురేనియం తవ్వకాలను ఆపాలని అవసరమైతే కర్నూలు జిల్లా బంద్ చేపడతామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని హెచ్చరించారు. యురేనియం తవ్వకాలను ఆపాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు డిమాండ్ చేశారని, ఇప్పుడు సిఎంగా ఎన్‌డిఎలో ఉన్న చంద్రబాబు యురేనియం తవ్వకాలను ఆపడానికి బాధ్యత తీసుకోవాలన్నారు. వామపక్ష పార్టీల సమావేశంలో కప్పట్రాళ్ల ఆందోళనలను బలపరుస్తూ తీర్మానం చేస్తామన్నారు. చంద్రబాబును కలిసి గతంలో ఆయన డిమాండ్ చేసినట్లు యురేనియం తవ్వకాలు ఆపాలని కోరతామన్నారు. న్యాయం జరిగేంత వరకూ కప్పట్రాళ్ల ప్రజలతో పాటు ఉంటామన్నారు.

## ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి

**- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరసింహులు**



సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరసింహులు మాట్లాడుతూ యురేనియం సమస్య మనుషుల, జంతువుల ప్రాణాలకు సంబంధించిన సమస్య అన్నారు. కడప జిల్లాలో యురేనియం తవ్వకాలతో ప్రజలు రోగాల బారిన పడ్డారన్నారు. ప్రజల పోరాటానికి ముందుగా మేముంటామన్నారు. మోడీ, కూటమి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని కోరారు. కప్పట్రాళ్ల గ్రామ పెద్ద రవీంద్ర శర్మ మాట్లాడుతూ 2018లోనే కప్పట్రాళ్ల పేరు అంతర్జాతీయ యురేనియం వెబ్‌సైట్‌లో ఉందన్నారు. 2019లో కప్పట్రాళ్లలో నాణ్యమైన యురేనియం ఉన్నట్లు ఒక సంస్థ జర్నల్‌లో ప్రచురించిందన్నారు. గ్రామ టిడిపి నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ యురేనియం సమస్య వల్ల 15 రోజులుగా 12 గ్రామాల ప్రజలు నిద్రపోవడం లేదన్నారు. టిడిపి నాయకులు వచ్చి తవ్వకాలు చేయబోమని చెప్పారని, అది ఎంత వరకూ నిజమో స్పష్టత ఇవ్వాలన్నారు. తమకు కమ్యూనిస్టు పార్టీల సహకారం అవసరమన్నారు. పి.కోటకొండ గ్రామవాసి ఆంజనేయ మాట్లాడుతూ ప్రజలు నష్టపోతుంటే ప్రజల శ్రేయస్సు ప్రభుత్వాలకు పట్టదా అని ప్రశ్నించారు. యురేనియం తవ్వకాలు చేపట్టబోమని ప్రభుత్వాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పి.కోటకొండ గ్రామవాసి హనుమంతరెడ్డి మాట్లాడుతూ గతంలో బంగారం ఉందని సర్వే చేసి మభ్యపెడితే నమ్మి మోసపోయామన్నారు. ప్రాణాలు అడ్డుపెట్టి అయినా యురేనియం తవ్వకాలను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ, కెవి నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎండి ఆనంద్ బాబు, సిపిఐ రాష్ట్ర నాయకులు కె రామాంజనేయులు, ఆవుల శేఖర్, సిపిఎం, సిపిఐ జిల్లా నాయకులు మునెప్ప, నబీ రసూల్, రాజా సాహెబ్, రామకృష్ణారెడ్డి, గురుదాస్, కృష్ణయ్య, నరసారావు, మండల నాయకులు సూరి, బజారి, శ్రీరాములు, మహబూబ్ బాషా, సుభాన్, శ్రీనివాసులు, వీరేంద్ర పాల్గొన్నారు.

## అనుమతులు రద్దయ్యే వరకూ పోరాటం

**- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య**



యురేనియం అనుమతులు రద్దయ్యే వరకూ పోరాటం సాగించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య తెలిపారు. ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం, మోడీ తలవంచాల్సిందేనని, లక్షలాది మంది రైతులు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి మోడీ దిగొచ్చేలా చేశారని చెప్పారు. యువత, మహిళలు అందరూ తిరగబడితే కాలం మారిపోతుందన్నారు. కప్పట్రాళ్ల ఉద్యమానికి కమ్యూనిస్టు పార్టీలు అండగా ఉంటాయన్నారు. అఖిల పక్షంగా ఢిల్లీ వెళ్లి మోడీని కలిసి యురేనియం అనుమతులు రద్దు చేసేలా చంద్రబాబు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అనుమతులు రద్దు చేయాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య**



కలెక్టర్ ప్రకటనతో, మాటతో కాకుండా యురేనియం తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను కేంద్రం రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. యురేనియంతో ప్రాంతాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. గ్రామసభ నిర్వహించకుండా, ప్రజల అనుమతి తీసుకోకుండా యురేనియం తవ్వకాల నిర్ణయం తీసుకోవడం సరైనది కాదన్నారు. వామపక్షాల తరపున ప్రత్యక్షంగా ఆందోళనల్లో పాల్గొంటామన్నారు.

# స్టీల్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

- స్టీల్ పరిశ్రమ వద్ద భూ నిర్వాసితుల కమిటీ ధర్నా
- రెండు వారాలలోగా సమస్య పరిష్కరిస్తాం
- పరిశ్రమ శాఖ అధికారులు హామీ

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

స్టీల్ పరిశ్రమలో స్థానిక యువతకు 75శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం భూ నిర్వాసితుల కమిటీ ఆధ్వర్యంలో జయరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ ఎదుట ధర్నా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న జరిగిన ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, భూ నిర్వాసిత కమిటీ నాయకులు కృష్ణారెడ్డి, రాధాకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి షాజహాన్, సుధాకర్ కెవిపిఎస్ నాయకులు మద్దిలేటి, రామకృష్ణ పాల్గొన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామ పొలిమేరలో మొదటి విడతగా 400 ఎకరాల్లో స్టీల్ పరిశ్రమను ఏర్పాటు చేశారన్నారు. ఒకటి రెండు నెలల్లో ఉత్పత్తి ప్రారంభమవుతున్నా భూములు కోల్పోయిన రైతులకు మాత్రం న్యాయం జరగలేదన్నారు. ఈ పరిశ్రమలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా చట్ట ప్రకారం ఏదైనా పరిశ్రమ స్థాపిస్తే ఆ ప్రాంతంలో భూములు కోల్పోయిన రైతుల పిల్లలకు , ఆ ఏరియాలో ఉన్న స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. విశాఖపట్నం, బెంగుళూరు, శ్రీకాకుళం, నెల్లూరు ఇతర రాష్ట్రాల నుండి బీహార్, కలకత్తా, యూపీ జార్ఖండ్ వివిధ ప్రాంతాల నుండి కార్మికులను ఇక్కడా నియమించుకున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న రైతులు నిరుద్యోగులు ఎక్కడో సుదూర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం తక్షణమే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ స్టీల్ పరిశ్రమలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేదాకా , రైతులకు నష్ట పరిహారం వచ్చేదాకా సిఐటియు మద్దతు ఉంటుంద ని సంఘీభావం తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడారు. నాయకులు సిఇఒ, ఎండి దృష్టికి తీసుకువెళ్లగా 15 రోజుల్లోపు పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కెవిపిఎస్ నాయకుల కృష్ణుడు, ఎంఆర్‌పిఎస్ నాయకులు గుండమయ్య, మహమ్మద్ బాష, శివకుమార్, బాలమద్దిలేటి, నాగశేషులు, షేక్షావలి, సుధాకర్, నవీన్, మాలిక్, శివకుమార్, రామాంజనేయులు, చంద్రశేఖర్, రైతులు నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైల్వేలో రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవడం సరికాదు

- 2.98 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి
- కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌ముందు డివైఎఫ్ఐ ధర్నా

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్**

రైల్వేలో రిటైర్డ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతి పనికి తీసుకునే ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ ముందు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ అధ్యక్షతన ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ స్టేషన్ మేనేజర్ లక్ష్మన్నకు వినతి పత్రం అందజేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ భారతదేశంలో ప్రపంచంలో ఎక్కడా లేనంతగా యువశక్తి ఉన్నప్పటికీ ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి యువతకు ఉపాధిని దూరం చేస్తుందన్నారు. ఫలితంగా భారతదేశాన్ని నిరుద్యోగ భారతంగా మారుస్తుందన్నారు. భారత రైల్వేలో ఇప్పటికే బాగా లాభాలు వచ్చే రైల్వే లైన్లను, రైల్వే స్టేషన్లను పార్సిల్ క్యాటరింగ్ లాంటి వాటిని ప్రైవేటు వారికి అప్పజెప్పడం వల్ల సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి సర్వీస్ చాలా ఖరీదుగా మారిందన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయాయన్నారు. భారతదేశంలోనే అతిపెద్ద ఉపాధి కల్పన కేంద్రంగా ఉండి రోజు కోట్లాదిమందిని తమ గమ్యస్థానాలకు చేర్చే భారత రైల్వేలో 2023 జూన్ 1 నాటికి 2,61,233 పోస్టులు అందులో కేవలం సేఫ్టీ కేటగిరీలో 53,178 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారన్నారు. ప్రస్తుతం అవి 2.89 లక్షలు ఖాళీగా ఉన్నట్లు సమాచారం అందుతోందన్నారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించిందన్నారు. దీన్ని డివైఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ చర్యలు నిరుద్యోగ యువతని మోసం చేయడమే అని, తక్షణమే రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకునే ఆలోచనను వెనక్కి తీసుకొని రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేయాలనన్నారు. సాధారణ ప్రజలకు రోజువారీగా సాధారణంగా వచ్చే జబ్బుల మందులపై విపరీతంగా రేట్లు పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, దీన్ని ఉపసంహరించుకోవాల ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప ధర్నాకు మద్దతుగా తెలిపి నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన ద్రోహం చేస్తుందని తెలిపారు. డివైఎఫ్ఐ కర్నూలు మండల నాయకులు సురేష్, న్యూ సిటీ ఉపాధ్యక్షులు విజయ్, నిరుద్యోగులు పాల్గొన్నారు.





ధర్నా చేపడుతున్న నాయకులు

# ఎలాంటి బోర్ల తవ్వకాలు జరగడం లేదు

**- కలెక్టర్ రంజిత్ బాషా**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్/క్రైం**

యురేనియం లభ్యత, పరిశోధన కోసం ఎలాంటి బోర్ల తవ్వకాలు జరగడం లేదని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందవద్దని కలెక్టర్ కోరారు. ఎలాంటి వదంతులను, అసత్య ప్రచారాలను నమ్మవద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత కొన్ని రోజులుగా కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు యురేనియం లభ్యత కోసం బోర్ల త్రవ్వకాలకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసనలు, ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఇదే విషయాన్ని జిల్లా అటవీ శాఖ అధికారి శ్యామల మరో ప్రకటనలో తెలిపారు.

**అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు : ఎస్పీ**

కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ చుట్టుపక్కల గ్రామాలలో యురేనియం లభ్యత, పరిశోధన కోసం ఎలాంటి బోరు తవ్వకాలు జరగడం లేదని, అనవసరంగా ప్రజలను భయాందోళనకు గురిచేసే వారిపై, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.





రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీచైతన్య ఎజిఎంలు సురేష్, మురళి కృష్ణ

# శ్రీ చైతన్య విద్యా సంస్థల రక్త దానశిబిరం

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

శ్రీ చైతన్య విద్యా సంస్థల గౌరవ చైర్ పర్సన్ అయిన ఝాన్సి లక్ష్మి బాయ్ జన్మదినం సందర్భంగా శ్రీ చైతన్య కళాశాలలు , పాఠశాలల ఆధ్వర్యంలో,కర్నూలు భాగ్య నగర్ శ్రీ చైతన్య కళాశాల లో రక్త దాన శిబిరం నిర్వహించారు. తమ విద్యా సంస్థల నుండి 92 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది స్వచ్ఛందంగా రక్త దానం చేశారని శ్రీ చైతన్య కళాశాలల ఎజిఎం మురళీకృష్ణ తెలిపారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్స్ ఎజిఎం జి సురేష్ బాబు మాట్లాడుతూ చైర్ పర్సన్ ఝాన్సి లక్ష్మి జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 6 న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మురళీకృష్ణ మాట్లాడుతూ రక్తదానం చాలా గొప్ప కార్యక్రమం అని అవసరం ఉన్నటువంటి వాళ్ళకి ఈ కార్యక్రమం ద్వారా సహాయం చేయగలగడం చాలా సంతృప్తిని కలిగిస్తుందని తెలిపారు. కళాశాల డీన్స్ బాలాజీ ,సరళ , కళ్యాణ్ బాబు, కృపారాజు ,మృత్యుంజయుడు , శ్రీ చైతన్ స్కూల్స్ ఆర్ఐలు రంగారెడ్డి ,సీతరామ రెడ్డి ,వెంకటేశ్వర్లు ,రామాంజనేయులు , కళాశాలల ప్రిన్సిపల్స్ ,స్కూల్ ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు. తమ విద్యా సంస్థల నుండి భవిష్యత్తులో కూడా ఇటువంటి సమాజహిత కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎజిఎంలు మురళీకృష్ణ , సురేష్ బాబు తెలిపారు.

# వేతన సవరణతో సంబంధం లేకుండా పెన్షన్ రివిజన్ చేయాలి

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

బిఎస్ఎన్ఎల్ లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వేతన సవరణతో సంబంధం లేకుండా పెన్షన్ రివిజన్ చేయాలని ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్-డిఒటి పెన్షనర్స్ అసోసియేషన్ కర్నూలు జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్. విజయభాస్కర్ ఆధ్వర్యంలో కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజును ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలపై మూడు అర్జీలు సమర్పించారు. వేతన సవరణతో సంబంధం లేకుండా పెన్షన్ రివిజన్ చేయాలి. థర్డ్ పిఆర్సి సిఫార్సు మేరకు 01-01-2017 నుండి 15శాతం ఫిట్‌మెంట్‌తో పెన్షన్ రివిజన్ చేయాలని కోరారు. 2017 తర్వాత రిటైర్ అయిన వారికి 01-01- 2017 నుండి కొత్త స్కేల్ పైన నోషనల్ ఫిక్సేషన్ చేయాలన్నారు. న్యూ పెన్షన్ స్కీమ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో రాయితీలు ఇవ్వవలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు 8వ పే కమిషన్ ఏర్పాటు చేసి, కరోనాసమయంలో ఫ్రీజ్ చేసిన 18 నెలల డిఎను,డిఆర్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఫిక్స్‌డ్ మెడికల్ అలవెన్స్ నెలకు రూ.3000కు పెంచాలని కోరారు. పెన్షర్లకు మెడికల్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, అర్జీలను సమర్పించిన వారిలో సర్కిల్ అధ్యక్షులు ఎం.యాకోబ్ , జిల్లా అధ్యక్షులు ఎ.రామలింగం, జిల్లా ఉపాధ్యక్షులు పి.మద్దులేటి, జిల్లా కార్యదర్శి ఎల్.విజయభాస్కర్ , జిల్లా సహాయ కార్యదర్శి డి.వెంకటరామిరెడ్డి , జిల్లా ట్రెజరర్ ఎస్.ఖాజా మొదీన్ , జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కె.షబ్బీర్ , ఎన్.చంద్రశేఖర్ జి.పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపిని అభినందిస్తున్న బిఎస్ఎన్ డిఒటి పెన్షనర్స్

# డిఎంచ్ఒకు104 ఉద్యోగుల వినతి

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లా డిఎంహెఒ ఆఫీసర్ భాస్కర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 3 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని కుటుంబాలను పోషించటం చాలా కష్టం అవుతుందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలము రూ.50 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృధాకాకుండా చూడాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ , డిఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి. ఎఫ్ తిరిగి చెల్లించాలన్నారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయాలని, డిఎస్‌సి ద్వారా నియమితులయిన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టు లో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని, ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలని కోరారు.104 జిల్లా అధ్యక్షులు వై.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ చంద్రహాస్, ఇలియాజ్, అజమ్, మంజుల, కళ్యాణి, అశోక్, మల్లికార్జున, వినోద్, హాసన్ షరీఫ్, హాసన్ బేగ్, రాజేష్, మధు పాల్గొన్నారు.

# ప్రయివేటీకరణ చర్యలు విరమించుకోవాలి

**ఆర్‌టిఒ కార్యాలయం ముందు ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ధర్నా**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఆర్‌టిఒ కార్యాలయాల ప్రయివేటీకరణ చర్యలను వెంటనే విరమించుకోవాలని ఎపి ఆటోఅండ్‌ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆర్‌టిఒ కార్యాలయాల ప్రైవేటీకరణ ఆపాలని, జిఒ నెంబర్ 21ని రద్దు చేయాలని సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపిఆటో అండ్ ట్రాలీడ్రైవర్ యూనియన్ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఓల్డ్ సిటీ అధ్యక్షులు రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎం.విజయ రామాంజనేయులు మాట్లాడారు. మోటార్ యాక్ట్ సవరణ చట్టం వల్ల వాహనాల రిజిస్ట్రేషన్లు ఫిట్నెస్ సర్టిఫికెట్లు డ్రైవింగ్ లైసెన్స్ ప్రైవేటు సంస్థలకు అప్పగించడం తగదన్నారు. ఆటోమేటిక్ సెన్సార్ టెస్టింగ్ ద్వారా వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లు డ్రైవింగ్ లైసెన్సు చేయడాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. పాత పద్ధతి విధానాన్ని ఆర్‌టిఎ కార్యాలయంలోనే డ్రైవింగ్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. సెన్సార్ సిస్టం వల్ల వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్ కష్టతరం అవుతుందన్నారు. జిల్లా అంతా ఒకటే ట్రాక్ ఏర్పాటు చేయడం వల్ల జిల్లా వ్యాప్తంగా వచ్చే వందలాది వాహనాలు ఫిట్నెస్ కాక రోజులు తరబడి వాహనాలు నిలుపవలసి వస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి రవాణా రంగాన్ని దివాళా తీసేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు. లేకపోతే ఆటోల బంద్ చేపడతామనిహెచ్చరించారు. సిఐటి యూఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, ఆటో యూనియన్ ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి పి.మహిమూద్, ఉపాధ్యక్షులు దూదేకొండ కుమార్, నాగరాజు, వెంకటస్వామి, రామద్దయ్య, బడేబాష, రాము, చిత్తారి వీధి మధు, రామకృష్ణ, అడ్డాల నాయకులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఆర్‌టిఒ కార్యాలయం ముందు ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న విజయ రామాంజనేయులు

# యుటిఎఫ్ స్వర్ణోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-గూడూరు**

యుటిఎఫ్ ఆవిర్భవించిన తర్వాత 50 సంవత్సరాలలో తొలిసారిగా మన ఉద్యమ మహాసభలు స్వర్ణోత్సవ మహాసభలుగా గూడూరు , సి.బెళగల్ మండల శాఖల ఆతిథ్యంలో ఈనెల 9,10 తేదీలలో గూడూరు పట్టణంలో నిర్వహించనున్నారు. గూడూరులో బుధవారం జరిగిన సమావేశంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటీ మాట్లాడారు. మహాసభల తొలి రోజు ఈనెల9న శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఉపాధ్యాయ ప్రదర్శన , ప్రారంభ సభకు మన సంఘ కార్యకర్తలు ,సభ్యులు , ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. అన్ని స్థాయిల్లోని నాయకులు , అన్ని మండల ,పట్టణ శాఖల ప్రధాన బాధ్యులు ప్రత్యేక శ్రద్ధతో తగిన ప్రచారం కల్పించి ఎక్కువమందిని ఈ సభకు సమీకరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆదివారం సాయంత్రం వరకు జరిగే ప్రతినిధుల సభకు ప్రతినిధులంతా తప్పక హాజరై చారిత్రక స్వర్ణోత్సవ జిల్లామహాసభలను జయప్రదం చేయాలని సన్నాహక సమావేశంలో పిలుపునిచ్చారు.



వ్యాసరచన పోటీల విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసిన అతిథులు

# అమర్త్యసేన్ పై వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఆచార్య అమర్త్యసేన్ జన్మదినం సందర్భంగా పలు ఆర్థిక అంశాలపై చర్చ జరిగేలా డాక్టర్ అబ్దుల్ హఖ్ ఉర్దూ విశ్వవిద్యాలయములో 'భారత దేశ ఆర్థికవ్యవస్థ పై అమర్త్యసేన్ ప్రభావం' అనే విషయంపై మానవశక్తి పరిశోధన కేంద్రం , అర్థశాస్త్ర విభాగం సంయుక్తంగా వ్యాస రచన పోటీలను నిర్వహింరు. విజేతలకు ప్రశంసా పత్రాన్ని, జ్ఞపికను అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య పిఎస్. షావలి ఖాన్ మాట్లాడుతూ ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని పొందిన మొదటి భారత దేశ ఆర్థికవేత్త ప్రొఫెసర్ అమర్త్యసేన్ అని వీరి పరిశోధన ఫలాలు ఆర్థికశాస్త్ర పరిధిని పెంచి సమాజ సంక్షేమం దిశలో విస్తరించినాయని పేర్కొన్నారు. మానవశక్తి పరిశోధన కేంద్ర వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రహ్మాన్ మాట్లాడుతూ, ఆచార్య అమర్త్యసేన్ అర్థశాస్త్ర స్థాయిని విస్తృత పరచి, నైతిక విలువలతో అనుసంధానం చేసిన తొలి ఆర్థిక శాస్త్రవేత్త, కేవలం భౌతిక అభివృద్ధి లేదా సంపద సృష్టి మాత్రమే అర్థశాస్త్ర పరిధి కాదని అసమానతల , పేదరిక నిర్మూలన, మానవ సంక్షేమం సాధించడమే అర్థశాస్త్ర పరమావధిగా ప్రపంచానికి తెలియజేసిన మానవీయ అర్థశాస్త్ర ఆవిష్కరణ కర్త అని అన్నారు. వారు అభివృద్ధి చేసిన సిద్ధాంతాలు విధాన రూపకర్తలను , సంఘ సంస్కర్తలను , విద్యావేత్త లను ప్రేరేపణగా పనిచేస్తున్నాయి. న్యాయం, సమానత్వం, మానవ గౌరవం ప్రధాన విషయాలుగా నేటి ప్రపంచ గమనానికి స్ఫూర్తి నిచ్చే విధంగా వీరి రచనలు సాగుతున్నాయని వక్తలు కొనియాడాడు. రిజిస్ట్రార్ ఆచార్య లోక్‌నాథ్, సమన్వయకర్త, డాక్టర్ అఖ్తర్ బాను, ప్రిన్సిపల్ డాక్టర్ మహబూబ్ బాషా , అధ్యాపకులు, అబూ బకర్, జి బాబు రావు పాల్గొన్నారు.

## టిడిపితోనే గ్రామాలాభివృద్ధి

**- ఎమ్మెల్యే బీవీ**

**ప్రజాశక్తి - నందవరం**



ఎమ్మెల్యే బీవీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నందవరం మండలంలో పర్యటించారు. ముగతి గ్రామం నుంచి నాగలదిన్నె వరకు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని రోడ్ల నిర్మాణాన్ని వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేని స్థితిలో వైసిపి పాలన కొనసాగిందని విమర్శించారు. వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని తెలిపారు. రాష్ట్రం కోలుకోలేని స్థితిలో ఉన్నా అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రోడ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.200 కోట్లు కేటాయించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలపై వైసిపి ప్రభుత్వం విషప్రచారం చేస్తోందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. అనంతరం పొనకలదిన్నె గ్రామాన్ని సందర్శించారు. కూటమి నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రోడ్లు, డ్రైనేజీ పనులు, ఇంటింటి కుళాయి పనులను చేపట్టి గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో వెలసిన పెద్ద రాజుల స్వామి వారిని దర్శించుకున్నారు. ముగతి ఈరన్న, సూగూర్ గౌడ్, ఖాలిద్ యాదవ్, మాజీ సర్పంచ్ బాలరాజు, కొండారెడ్డి, ఈసా, డబ్బా ఈరన్న, టిడిపి పొనకలదిన్నె సీనియర్ నాయకులు శంతయ్య, వెంకటేష్, మల్లేష్, మునెప్ప, నరసింహ, యువ నాయకులు లక్ష్మి కాంత్, శ్రీరాములు, శేఖర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కట్టుబడి ఉంటా

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం ప్రభుత్వాస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధి గురించి చర్చించారు. అక్కడ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సుధా, వైద్యులు పాల్గొన్నారు.

**ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు :** ప్రభుత్వాస్పత్రి కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులుగా రామకృష్ణ, అంబేద్కర్, సురేష్ చౌదరిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా డాక్టర్లు ఉంటారు.

## ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

**- డిఆర్‌సి ఎడిఎ వెంకటేశ్వర్లు, ఎఒ జయలక్ష్మి**

**ప్రజాశక్తి - చిప్పగిరి**



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

వ్యవసాయ సాగులో పూర్వపు పద్ధతులను తొలగించి అధిక పెట్టుబడులు సాధించడానికి ఆధునిక పద్ధతులను అవలంబించాలని డిఆర్‌సి ఎడిఎ వెంకటేశ్వర్లు, చిప్పగిరి ఎఒ జయలక్ష్మి రైతులకు సూచించారు. బుధవారం ఎఒ జయలక్ష్మి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది'లో భాగంగా నగరడోన, బెల్డోన గ్రామాల్లో వివిధ రకాల పంటలను పరిశీలిస్తూ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఉద్దేశంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు కనిపెట్టిన ఆధునిక పద్ధతులను రైతులకు తెలిపేందుకు ప్రతి గ్రామంలోనూ 'పొలం పిలుస్తోంది' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. రైతులందరూ ఆధునిక పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టి పంట సాగులో మెళకువలు పాటిస్తూ అధిక దిగుబడులు రావడానికి రైతులు సన్నద్ధం కావాలని కోరారు. రబీ పంటలకు బీమా తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు సునీత, జ్యోతిర్మయి, కుమార్, రైతులు పాల్గొన్నారు.

## 4వ ఉద్యోగులుగా గుర్తించాలి

**- కాటికాపరుల విజ్ఞప్తి**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని శ్మశాన వాటికలో కాటికాపరులుగా పని చేస్తున్న తమను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపరులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని 18వ వార్డు సచివాలయంలో కాటికాపరుల గుంతలు తీసే వేరేల సంఘం (కెజిబిఎస్) ఆధ్వర్యంలో సచివాలయ అధికారి లీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెజిబిఎస్ జిల్లా అధ్యక్షులు బి.తిక్కప్ప, పట్టణ కార్యదర్శి యువరాజు మాట్లాడారు. శ్మశానంలో వృత్తిని నిర్వహించే కాటికాపరులు, గుంతలు తీసేవారు, బేగరులు, ఏట్లోళ్లు, సల్వాదులుగా పిలువబడే వారందరినీ వృత్తిదారులుగా గుర్తించాలని కోరారు. వారందరినీ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, జిఒ 1235 ప్రకారం ప్రతి దళిత పేటకు రెండెకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులందరికీ ఉపయోగపడే పరికరాలు ఇవ్వాలని, ఉచిత ఆరోగ్య బీమా, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. కాటికాపరులు వినోద్ కుమార్, చంద్రశేఖర్, హనుమంతు, ఉదయ్, నరేంద్ర, నేతాజీ ఉన్నారు.

# మళ్లీ తెరపైకి భూ వివాదం...

- వీడని సర్వే నెంబర్ 352 సమస్య
- 'మాదంటే.. మాదే' అంటూ ఇరు గ్రూపుల వాదన

**ప్రజాశక్తి - ఆదోని**

**ఆదోని పట్టణంలో సర్వే నెంబర్ 352 భూ వివాదం తెరపైకొచ్చింది. ఈ సర్వే నెంబర్‌తో ఆదోని పరిసర ప్రాంతాల్లో సామాన్యులు, ఉద్యోగులు భూములు, ఇంటి స్థలం కోసం ప్లాట్లు కొనాలంటే హడలెత్తిపోతున్నారు. కబ్జాలతో సామాన్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.**



వివాదానికి కారణమైన భూమి ఇదే

పట్టణంలోని మండగిరి ప్రాంతం మాత్రమే కాదు. సామాన్యులు భూమి కొనాలంటే ఎక్కడ కబ్జాకు గురవుతుందోనని భయపడుతున్నారు. పట్టణంలోని 352 సర్వే నెంబర్‌లో స్థల వివాదాలు పైగా నలుగుతూనే ఉంది. గతంలో చాలామంది డబుల్ రిజిస్ట్రేషన్లు చేసుకొని రాజకీయ, ధనబలంతో అందిన కాడికి దోచుకొని వెళ్లిపోయారు. గతంలో పార్టీలు ఓడిపోవడానికి ప్రధాన కారణం ఈ కబ్జాలే. నియోజకవర్గం లో ఉన్న గత నాయకులు సామాన్యులను బెదిరింపులు గురి చేసి అక్రమంగా భూములను రాయించుకున్నట్లు కూడా విమర్శలు వినిపించాయి. సామాన్యులను కొందరు వివిధ రకాలుగా మానసికంగా ఇబ్బందులకు గురి చేసి భూములను లాక్కున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఈ తరుణంలోనే బుధవారం ఉదయం ఆదోని పట్టణంలోని సర్వే నెంబర్ 352లో 'స్థలం నాదంటే.. నాద'ంటూ రెండు గ్రూపులు వాదోపవాదాలు చేసుకున్నాయి. కొందరు మీడియా ముందుకొచ్చి 'స్థలం మాదే. మా తాతల కాలం నాటిది' అంటూ పత్రాలు చూపించారు. మరో గ్రూపు గత పదేళ్లుగా ఎన్నో చిక్కులను విడిపించుకుని ఈ భూమిని తాము అసలైన హక్కుదారుల నుంచి కొనుగోలు చేశామని, ఇప్పటివరకు దగ్గర కూడా రాని వీళ్లు ఇప్పుడొచ్చి 'మాది' అంటూ అడ్డుపడుతున్నారని, వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామంటూ తెలిపారు. అలాగే వారి భూమి హద్దులను పరిశీలిస్తే తేడాలు కనిపిస్తున్నాయని రామకృష్ణా రెడ్డి (మొదట భూమిలో ఆధీనంలో ఉన్న వ్యక్తి) తెలిపారు. ఇలాంటి సమస్యలు దారి తీయడానికి ప్రధాన కారణం ప్రభుత్వ అధికారులేనని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ అధికారుల అవినీతి కారణంగానే స్థలాల కోసం ఇలా సామాన్యులు ఘర్షణలకు దిగే అవకాశాలు కూడా ఉన్నాయని అంటున్నారు. దీనిపై పోలీసు ఉన్నత వర్గాలు నిజానిజాలు నిగ్గు తేల్చి చట్టబద్ధంగా అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## 'రాజకీయ ఒత్తిడి తగ్గించాలి'

**ప్రజాశక్తి - నందవరం**

ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ ఒత్తిళ్లను తగ్గించాలని ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సౌజన్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చడం, మారకపోతే రాజకీయంగా ఒత్తిడి పెట్టడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు విధుల నుంచి తప్పుకోవాలని, రాజీనామా చేయాలని ఒత్తిడి చేయడం సరైంది కాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్ గౌడ్, అర్జునుడు, కృష్ణ, చిన్న ఈరన్న గౌడ్, సోమశేఖర్, శివ పాల్గొన్నారు.

## 'పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి'

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

ఉపాధి హామీ చట్టంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని వ్యకాస నాయకులు తిక్కన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించి, వలసలు నివారించాలని వ్యకాస ఆధ్వర్యంలో కల్లుకుంట, చిన్నతుంబళం, పెద్దకడబూరు సచివాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. సిబ్బందికి వినతిపత్రాలు అందజేశా రు. ఉపాధి పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు పరమేష్, హనుమంతు, శ్రీనివాసులు, టిప్పు సుల్తాన్ పాల్గొన్నారు.

## ఈఎస్ఐ కార్డు ఉన్నా ప్రయోజనం లేదు

**- పారిశుధ్య కార్మికుడు షేకన్న**

**ప్రజాశక్తి - ఆదోని**

పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈఎస్ఐ కార్డు ద్వారా ఎలాంటి ప్రయోజనమూ లేదని పారిశుధ్య కార్మికుడు షేకన్న వాపోయారు. వరదల్లో విజయవాడలో సేవలందించిన పారిశుధ్య కార్మికులకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ శాంత ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. విధుల్లో భాగంగా బరువు పనులు చేసేటప్పుడు చాలామంది నడుము నొప్పులతో బాధపడుతున్నామని, చికిత్స కోసం ఆస్పత్రికి వెళితే కేవలం ఒపి మాత్రమే చూసి ట్యాబ్‌లెట్లు ఇస్తున్నారని తెలిపారు. మెరుగైన చికిత్స అందించకుండా నిర్లక్ష్యం చేయడంతో పనులు చేయలేక చాలామంది మంచానికే పరిమితం అయ్యారని పేర్కొన్నారు. ఈఎస్ఐ ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నా అధికారులు తమకు కల్పించడం లేదని వాపోయారు.

**పట్టణ పరిశుభ్రతకు పాటుపడదాం :** పట్టణంలో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య కార్మికులు చేస్తున్న విధులకు సహకరించాలని ఎమ్మెల్యే పార్థసారథి ప్రజలను కోరారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వారి సంక్షేమానికి పాటుపడతామని తెలిపారు. వైస్ ఛైర్మన్ నరసింహులు మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు అమోఘమని, వారికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ హామీఇచ్చారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, నాగరాజ్, కౌన్సిలర్లు బాలాజీ, చిన్న, సుధాకర్, లలితమ్మ, రాజేశ్వరి ఉన్నారు.



కొత్త వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

IN THE COURT OF THE PRL.JUNIOR CIVIL JUDGE COURT, KURNOOL
E.P.No. 272/2021
IN
DISPUTE NO. 276/2018.

BETWEEN
KAPIL CHITs (HYD) PVT LTD
Kurnool Branch. ...D.Hr.
AND
K.HANUMANTHU and Others. ...JDR's

TO:
JDR NO.3
**V.Raja Sekhar, S/o. V.Beesanna, Staff No.427878, APSRTC Driver Gr-2 Kurnool-1. H.No:5/44,G-Singavaram, Kurnool(Dt).**

Whereas the above named the Plaintiff company filed a suit against the Defendants for recovery of the suit. You area hereby directed to appear before this Honorable court 21st **November 2024 at 10-30** A.M., either in person or your Advocate and file objections if any, failing which the matter will be decided in your absence and you will be set ex party.
Hearing dt: 21-11-2024
KURNOOL.

**Sri. G. NAGASESHAIAH**
ADVOCATE
FOR DHR. KURNOOL.

# బాబు పాలనలో అభివృద్ధి శూన్యం

- మరో ఆరు నెలలు చూస్తాం... ● హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు ● ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

**ప్రజాశక్తి - ఆలూరు**



**ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగు నెలల్లో ప్రజలకు చేసిన పనులు శూన్యమని ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరుపాక్షి విమర్శించారు. నాలుగు నెలల్లో కూటమి ప్రభుత్వం పింఛను పెంచిందే తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయలేద న్నారు. మరో నెలలు చూస్తామని, హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ నాలుగు నెలల పాలనపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.**

**ప్రభుత్వం నాలుగు నెలల పాలన ఎలా ఉంది..?**

**విరుపాక్షి :** కూటమి ప్రభుత్వం నాలుగు నెలల పాలన అట్టర్ ప్లాప్ అయింది. కేవలం పింఛను పెంచారే తప్ప ఏమీ చేయలేదు. తల్లికి వందనం, రైతు భరోసా, మహిళలకు ఉచిత ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, బీసీలకు 50 ఏళ్లకు పింఛను లాంటి పథకాలు ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

**ప్రభుత్వ హామీల అమలుకు ఎలాంటి పోరాటాలు చేస్తారు..?**

**విరుపాక్షి :** ప్రభుత్వ హామీల అమలుకు మరో ఆరు నెలలు వేచి చూస్తాం. అప్పటికీ ప్రభుత్వం అమలు చేయకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతాం. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని బాబు ఆర్భాటంగా చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపే రాష్ట్ర ప్రజలపై రూ.6 వేల కోట్లకు పైగా భారాలు మోపుతున్నారు. రైతు మోటార్లకు మీటరు బిగిస్తే పగలగొట్టమని చెప్పిన బాబు, లోకేష్ ఇప్పుడు మీటర్లు బిగిస్తున్నారు. ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని పథకాలు హామీలిచ్చి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి సరిగా లేదని బీద అరుపులు మాట్లాడడం తగదు.

**నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది..? వాటి పరిస్థితి ఏమిటి..?**

**విరుపాక్షి :** రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్న మాట వాస్తవమే. ఆలూరు మండలంలోని పెద్దహోతూరు, ఆస్పరి మండలం బిణిగేరి వద్ద రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. హోళగుంద మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోడ్ల మరమ్మతుల పనులు చేపట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం పెద్దహోతూరు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. త్వరలో అన్ని రోడ్లకు మరమ్మతు పనులు చేపడుతామని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు రహదారులు మంజూరయ్యాయి. ఆ జాబితాను కూడా త్వరలోనే తెలియజేస్తాం.

**వేదవతి, నగరడోన రిజర్వాయర్ నిర్మాణానికి ఎలాంటి కృషి చేస్తున్నారు..?**

**విరుపాక్షి :** వేదవతి పూర్తి చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాను. వేదవతి పూర్తికి అవసరమైతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తాం. నగరడోన రిజర్వాయర్‌ను పూర్తి చేసేందుకు గతంలో ఎంతో ప్రయత్నించాను. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనిని పూర్తి చేసేందుకు కృషి చేస్తాను. హెచ్ఎల్‌సికి ఆలూరు బ్రాంచి కెనాల్ (ఎబిసి) వద్ద తూము ఏర్పాటుకు కృషి చేస్తాను.

**ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న యురేనియం తవ్వకాలను ఎలా అడ్డుకుంటారు...?**

**విరుపాక్షి :** ప్రజల ప్రాణాలను హరించే యురేనియం తవ్వకాలను ప్రజలందరి సహకారంతో అడ్డుకుంటాం. ఆ ప్రాంతంలో తవ్వకాలను నిలుపుదల చేయాలని వైసిపి, వామపక్షాలతో కలిసి సంఘటితంగా పోరాడతాం. నేను కూడా సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాను.

**ప్రతిపక్షంలో ఉన్న మీరు కేడర్‌కు ఎలాంటి భరోసా ఇస్తారు..?**

**విరుపాక్షి :** ప్రతిపక్ష ఎమ్మెల్యేను అయినప్పటికీ కేడర్‌కు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. కేడర్ కష్టసుఖాల్లో తోడుగా ఉంటాను. ప్రతినెలా గ్రామాల్లో తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు కేడర్‌ను పలుకరిస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపుతాను. అధికార పార్టీ ఒత్తిళ్లకు ఏ కార్యకర్త బెదిరేది లేదు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ.ఎ.నెం.431/2023 ఇన్ ఓ.ఎస్.నెం.61/2021

సజ్జన గాండ్ల శ్రీదర్. ...వాది/అర్జిదారు
**వర్సెస్**
ఆకుల హషమ్ బాష
తండ్రి ఆకుల షేక్షావలి ఇంటి నెం.10-68/39, పెద్దమార్కెట్ దగ్గర, కర్నూలు. ప్రస్తుతం ఇంటి నెం.13-97-1-1,13వ వార్డు, కోడుమూరు గ్రామము, కర్నూలు జిల్లా. ...ప్రతివాది/రెస్పాండెంటు

**ప్రతివాది/రెస్పాండెంటుకు ఆర్డర్-34, రూల్-5 మరియు సెక్షన్ 151 ప్రకారం నోటీసు**

పై నెంబర్ దావాలో వాది/అర్జిదారు షెడ్యూలు దాఖల ఆస్థిపైన ప్రతివాది/రెస్పాండెంటు పైన పొందిన ప్రిమిలినరి డిక్రిని, ఫైనల్ డిక్రీగా చేయమని కోరుతూ అర్జిదాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది/రెస్పాండెంటు అయిన నీకు ఆక్షేపణ ఉన్న 28-11-2024 తేదిన పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీపరోక్షమున విచారించి తీర్మానింపబడును.

**షెడ్యూలు :** కర్నూలు రిజిష్టర్ డివిజన్, కోడుమూరు సబ్ డివిజన్, కోడుమూరు మం॥ కోడుమూరు గ్రామ పంచాయితి బోర్డు దాఖలా కోడుమూరు గ్రామము 13వ వార్డులోని 13-97-1 తెలుపు నెంబరు గల ఇంటికి చెక్కుబంది. తూర్పు-ఆకుల ఖాజా హుశేన్ ఇల్లు, పడమర-రస్తా, ఉత్తరం-మాలాసహెబ్ ఇల్లు, దక్షిణం - బి.కౌలుట్ల ఇల్లు ఈ హద్దులకు లోనైన ఇంటికి కొల్తలు: తూర్పు-పడమర-48:3 ఆ. నలబైయినిమిదిపాయింటు మూడు అడుగులు, ఉత్తరం-దక్షిణం-15 అ. (పదిహేను అడుగులు) ఐరసి : 723.75 చ.అ.లు లేక, 80.4 చ.అ.లు గలది.

**(కోర్టు వారి ఉత్తర్వుమేరకు)**

**యిస్కాల శ్రీనివాసులు,**
వాదిపరం అడ్వకేటు, కర్నూలు.



మాట్లాడుతున్న అధికారులు

## చిన్నపిల్లలతో పనులు చేయిస్తే చర్యలు : అధికారులు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన చిన్న పిల్లలతో పనులు చేయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆదోని లేబర్ శాఖ సహాయ కార్మిక గ్రేడ్-3, గ్రేడ్-1 అధికారి ఎం.సుందరేష్, కె.వెంకట్రాముడు తెలిపారు. బుధవారం స్థానికంగా ఉన్న హోటళ్లు, లాడ్జీలను, ఇతర సంస్థలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 18 ఏళ్లలోపు చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం లేబర్ యాక్ట్ ప్రకారం నేరమని చెప్పారు. అందులో భాగంగానే తనిఖీలు నిర్వహించామన్నారు. హోటళ్లు, లాడ్జీలు, ఇతర ప్రయివేట్ సంస్థల్లో బాల కార్మికులు కనిపిస్తే తమ దృష్టికి తీసుకు రావాలని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

**- తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి**

**ప్రజాశక్తి - మంత్రాలయం**



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న విజయరామిరెడ్డి

దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామం దగ్గర యురేనియం తవ్వకాల గురించి సామాజిక మాధ్యమాల్లో (సోషల్ మీడియాలో) ప్రచారం జరుగుతోందని ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ పరమేష్ నాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి కేసు నమోదు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

# సమన్వయంతో అభివృద్ధి

**- అధికారుల అలసత్వంపై ఎమ్మెల్యే అసంతృప్తి**

**ప్రజాశక్తి - ఆలూరు**

మండల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనులు చేయాలని, సర్వసభ్య సమావేశం ఉందని తెలిసినా సమావేశానికి గైర్హాజరయిన అధికారుల అలసత్వంపై ఎమ్మెల్యే బి.విరుపాక్షి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆలూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి జె.రంగమ్మ అధ్యక్షతన వహించారు. మొలగవల్లి వైస్ ఎంపిపి శ్రీరాములు మాట్లాడుతూ... గ్రామంలోని చెరువులో ఉపాధి హామీ చట్టం కింద ముళ్లకంపలు సగం వరకే తొలగించారని, తొలగించిన కంపను అక్కడే వదిలేశారని, ఎపిఒకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదని తెలిపారు. ఎం.కొట్టాలలో గ్రామం కోసం సంపు ఏర్పాటు చేసేందుకు స్థలం చూపించగా స్థలం తమదని ఇతరులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కురుకుంద గ్రామంలో అంగన్వాడీ, పాఠశాలలో ముళ్ల కంచెను తొలగించేందుకు సొంత ఖర్చులతో చేయాల్సి వచ్చిందని సర్పంచి దేవరెడ్డి తెలిపారు. సర్పంచులకు నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం చెబుతుందే తప్ప ఇంతవరకు మంజూరు చేయలేదని సర్పంచులు తెలిపారు. ఎంపిపి నిధులు పైసా కూడా ఇవ్వడం లేదని టిడిపి ఎంపిటిసిలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ... మండల అభివృద్ధికి రాజకీయాలకు అంతీతంగా పని చేయాలని టిడిపి వారికి ఇస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, తను కూడా మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సమావేశంలో తెలిపిన సమస్యలను ఆయా శాఖల అధికారులు స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు. జడ్‌పిటిసి చంద్ర శేఖర్, ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి సూర్య నారాయణ, డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.





మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

## నైపుణ్యతను వెలికి తీయాలి

**ప్రజాశక్తి - చిప్పగిరి**

వివిధ రంగాల్లో మంచి ప్రతిభ, నైపుణ్యం కలిగిన వారిని గుర్తించడానికి ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించి, వారి ద్వారా గ్రామాల్లో నైపుణ్యత కలిగిన వారిని గుర్తిస్తారని పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న, చిప్పగిరి పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ మండల కోఆర్డినేటర్ మల్లికార్జున ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఆదోనిలో ప్రత్యేక శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్లు శ్రీకాంత్, పవన్ కుమార్‌తో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో విధులు నిర్వర్తించే సచివాలయ అధికారులతో ఇంటింటికీ వెళ్లి 15 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు వయస్సున్న వారిని కలిసి వారిలో నైపుణ్య గణనపై వివరాలు తెలు సుకొని ఆ వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి అందిస్తారన్నారు. ప్రభుత్వం ఆ వివరాల మేరకు ఆయా రంగాల సంస్థలకు ఉద్యోగాలు ఖాళీ ఏర్పడినప్పుడు వీరిని తీసుకునేలా అవకాశం కల్పిస్తుందన్నారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఉరుకుందలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

## ఎమ్మెల్యే పుణ్యక్షేత్రాల సందర్శన

**ప్రజాశక్తి - కౌతాళం**

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి, శ్రీబుడుములదొడ్డి ఆంజనేయస్వామి క్షేత్రాలను మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సందర్శించారు. బుధవారం ఉరుకుంద దేవాలయ అధికారులు, పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్ ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ స్వామి, శివన్న స్వామి, నాగరాజ్ స్వామి శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం సులేకేరి గ్రామ సమీపంలోని బుడుముల దొడ్డి ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కౌతాళం సర్పంచి పాల్ దినకరన్, నాయకులు అబ్దుల్ సమద్, వెంకట రామరాజు, భీమేష్, రాముడు, హుస్సేని, తాహెర్ పాల్గొన్నారు.

## అధిక ధరలు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు**

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు విమర్శించారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజల మధ్యన చిచ్చు పెట్టడానికి ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కూడా విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, గతంలో ఇచ్చిన మాట తుంగలో తొక్కి, ట్రూ అప్ చార్జీల భారాన్ని మోపిందని మండిపడ్డారు. రైతులు పండించిన పత్తి, ఉల్లి, మిరప పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసమే సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8 నుంచి 14 వరకు 'ప్రజా పోరు' నిర్వహిస్తున్నామని తెలిపారు. 14న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, బాష, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

# రైల్వేలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి - ఆదోని**

రైల్వే శాఖలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్ కోరారు. బుధవారం ఆదోని రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడారు. రైల్వేలో ఖాళీగా ఉన్న 2.89 లక్షల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేనంత యువశక్తి భారతదేశంలో ఉందని, ఉపాధి కల్పనలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్‌పరం చేసి యువతకు ఉపాధిని దూరం చేస్తోందని మండిపడ్డారు. రైల్వేలో ఇప్పటికే లాభాలు వచ్చే రైల్వే లైన్లను, రైల్వే స్టేషన్లను పార్సిల్ కేటరింగ్ లాంటి వాటిని ప్రయివేట్‌కు అప్పజెప్పడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు సర్వీస్ చాలా ఖరీదుగా మారిందన్నారు. మరోవైపు యువతకు ప్రభుత్వ ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద ఉపాధి కల్పన కేంద్రంగా ఉన్న రైల్వేలో 2023 జూన్ 1 నాటికి 2,61,233 పోస్టులు, అందులో కేవలం సేఫ్టీ కేటగిరిలో 53,178 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. ప్రస్తుతం 2.89 లక్షలు ఖాళీగా ఉన్నట్లు సమాచారం అందుతోందన్నారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించిందని తెలిపారు. ఈ ఆలోచనను వెనక్కి తీసుకొని రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మోహన్, నవీన్, వీరేష్, నాగరాజ్ ఉన్నారు.




రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

IN THE COURT OF THE VIITH ADDITIONAL DISTRICTJUDGE KURNOOL
A.S.No.1/2024

విజయ బట్టు విజయలక్ష్మి. ...అప్పీలెంట్
V/s
జి.గౌరి మరియు ఇతరులు. ...ప్రతివాదులు

**To**
R5. W.B. శ్రీధర్ రాజు, S/o W.B.జనార్దన్ రాజు, H.No.404, 4వ అంతస్తు, ప్రణవసాయి అపార్ట్‌మెంట్, K.C కెనాల్ అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర, కర్నూలు.
R7. P. పద్మావతి W/o P. చంద్ర, హిందూ, వయస్సు 39 సంవత్సరాలు, R/o H.No.8/182A1, కల్లూరు ఎస్టేట్, కర్నూలు.
R9. బి.మాధవి లత W/o. బి.పరాధి హిందూ, వయస్సు సుమారు 45 సంవత్సరాలు. R/o. H.No:404, 4వ అంతస్తు, ప్రణయసాయి అపార్ట్‌మెంట్, కేసి కెనాల్ దగ్గర, అయ్యప్ప స్వామి దేవాలయం దగ్గర, కర్నూలు.
R 12. P. నూతన్ కుమార్, S/o దివంగత సాంబశివరావు, హిందూ, సుమారు 37 సంవత్సరాలు, R/o D.No.2-5-26, బస్టాండ్ దగ్గర, కర్నూలు.
R 13. G. శ్రీకాంత్ S/o G. ప్రసాద్, హిందూ, వయస్సు సుమారు 46 సంవత్సరాలు, R/o D.No.6- 15, 2వ లేన్ అయ్యప్ప కాలనీ, కర్నూలు. ...రెస్పాండెంట్స్

**ప్రతివాదులకి దావా సమన్స్**

పై నెంబర్ గల దావాలోని ప్రతివాదులు అయిన మీరు కోర్టు ద్వారా మరియు పోస్ట్ ద్వారా దావా సమన్లు పలుమార్లు పంపినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోనందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 20-11-2024 వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకోనవలెను. లేనియెడల పై కోర్టు వారు మీ పరోక్షమున దావాను తీర్మానించేదరు అని తెలియచేయడమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేది : 20-11-2024**

**యం.సి.మద్దిలేటి,**
**కె. శ్రీరామ్,**
న్యాయవాదులు, కర్నూలు.